విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 122 | మంగళవారం 01. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## ఆర్ఎస్ఎస్‌కు రెండు నాల్కల ధోరణి

**అది ఆర్ఎస్ఎస్ ఉపయోగించే పాత ట్రిక్**

**అసదుద్దీన్ ఒవైసీ**

**మోహన్ భగవత్ వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ ఆడే పాత నాటకం**



హైదరాబాద్, (తెలంగాణ వాణి) ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన తాజా వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించేవాడు హిందువే కాడు" అని భగవత్ పేర్కొనడంపై ఒవైసీ స్పందిస్తూ.. ఇది ఆర్ఎస్ఎస్ ఉపయోగించే పాత ట్రిక్ అని, వారి ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనమని దుయ్యబట్టారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ మేరకు తన అభిప్రాయాలను మిగతా 2లో..

## ప్రణబ్ ముఖర్జీకి ఘన నివాళి

దేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న స్వర్గీయ ప్రణబ్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రితో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.





# విపక్ష నేతగా విఫలం
# కేసీఆర్ రాజీనామా చేయ్

- కేసీఆర్ కోసం ఇప్పటివరకు రూ.21 కోట్ల ఖర్చు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి.
- కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి.
- మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి.
- ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది.
- రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి.
- మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది.
- 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు.
- 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు.
- కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు.
- కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారు.
- ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు.
- మరి కేసీఆర్‌ను ఏం చేయాలి.

హైదరాబాద్ తెలంగాణ వాణి)

రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికాబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించి అనంతరం మాట్లాడారు. "అంబర్‌పేటలో ఏ ప్రభుత్వ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయింది? మేం రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడున్న వాళ్లకు ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితమైంది. ఎడ్ల సుధాకర్ మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ప్రజలు ఆలోచించాలి. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్కసారైనా ఒకటో తేదీన జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉంది.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలి.

## నీటి వాటాను తరలిస్తున్నా, రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు**



- "ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రం
- మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది.
- మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.
- రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం
- తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు?
- ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ కక్షపూరిత కుట్ర

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే.. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా కేసులు
- దళితులపై వివక్ష, అంటరానితనాన్ని ప్రశ్నించడం నేరమా ?
- అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం ర్యూలించలే..
- బాధితుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం..
- అన్యాయాన్ని ప్రశ్నించిన వారినే నిందితులుగా చిత్రీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం



దళితులపై జరుగుతున్న వివక్ష, అంటరానితనం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయ కుట్రకు నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎదు ర్కొన్న అవమానకర పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే.. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రశ్నించిన రాహుల్ గాంధీ, పైనే కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. దళితులపై వివక్ష, అంటరానితనాన్ని ప్రశ్నించడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించలేరని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## నేపాల్‌లో మరో జల ప్రళయం..

**మరో హై అలర్ట్ జారీ**

**నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ**

**నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు**

**రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన**

**సహాయక చర్యల్లోని సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి**



నేపాల్: ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ మిగతా 2లో..

## సెమీ కండక్టర్ తయారీలో పెట్టుబడులు పెట్టండి

- తెలంగాణ-జర్మనీ లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు సహకరించండి
- జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ ప్రతినిధులతో సమావేశం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్ తెలంగాణ వాణి)

సెమీ కండక్టర్ తయారీ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ కంపెనీలను ప్రోత్సహించాలని జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్(జీఐబీఏ) ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. కెల్‌స్టర్‌బాక్ నగర మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలో జీఐబీఏ ప్రతినిధులు సోమవారం సెక్రెటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్, ఆటోమేషన్ తదితర రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అనుకూలతలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సెమీ కండక్టర్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, పెట్టుబడి ప్రోత్సాహకాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వెల్లడించారు.

## నేను పిరికిదాన్ని కాదు

**టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత**



హైదరాబాద్ తెలంగాణ వాణి)

బీఆర్ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయడంపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద పెద్ద నాయకులే చెప్పారని, ఆ తర్వాత పార్టీలో నుంచే తనను బయటకు పంపారని, ఎందుకు ఇలా చేయాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ పాంచజన్య సభలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తీరును ఎండగట్టారు. సొంతగా పార్టీ పెట్టిన తర్వాత తొలి సారి నిజామాబాద్ గడ్డకు వచ్చిన కవిత.. కన్నీటి పర్యంతమైనంత మాత్రాన తాను పిరికిదాన్ని కాన న్నారు. ఎంతో బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీర న్నారు. దీంతో ఆ ప్రాంగణమంతా.. కవిత సీఎం.. సీఎం.. అనే నినాదాలతో కార్యకర్తలు హోరెత్తి ంచారు. కవిత బోరున విలపించడంతో.. అక్కడున్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. తెలంగాణలో ఇంకా చేసుకోవాల్సిన మంచిపనులెన్నో ఉన్నాయని, అందుకే పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపితే.. తన అత్త, మామలు ఒక్కమాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని, కన్నబిడ్డలా చూసుకున్నారన్నారు. ఆర్నెల్లు జైలుకెళ్లి వచ్చిన తనను ఆదరించాల్సిన పుట్టినిల్లు బయటకు పంపేసిందని మరోసారి కన్నీరు పెట్టుకున్నారు.



## కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

- ఆంధ్ర ప్రదేశ్ సీఎం చంద్రబాబు
- వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను జాతికి అంకితం చేసిన సీఎం
- మాట ఇచ్చాను.. నిలబెట్టుకున్నాను. పునాది వేశాను.
- ప్రాజెక్టును పూర్తి చేశానని సగర్వంగా చెబుతున్నాను.
- ఇది నా అదృష్టం. 30 ఏళ్ల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను.
- 30 ఏళ్ల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశాను.
- నాడు చేసిన సంకల్పం.. నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది.
- ఇది భగీరథ ప్రయత్నం.. కొండలు వస్తే తొలిచి ముందుకెళ్లాం.
- ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను.

## తిమ్మాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఎల్లారెడ్డి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సోనీ ప్రకాష్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

## తెలంగాణలో మాదిగలకు న్యాయం చేయాలి

### ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కవితకు వినతిపత్రం



**నిజామాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు అన్ని రంగాల్లో న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు, ఇళ్లు, భూముల పంపిణీలో మాదిగలకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. నిజామాబాద్‌లో మాదిగలకు ప్రత్యేక కళ్యాణ మండపం, మాదిగ భవనం ఏర్పాటు చేయడంతో పాటు భూమి కేటాయించాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తే మాదిగల సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యత కల్పించాలని కవితను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు, విద్యార్థినులు వేధింపులపై నిర్భయంగా షీ టీంను సంప్రదించాలి



**ఆదిలాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా షీ టీంను సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ విద్యార్థులకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అన్నారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. షీ టీం అత్యవసర నంబర్ 8712959953, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, డీఎండబ్ల్యూ కలీం, మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ మాధురి, ఫహేమిద్, షి టీం బృంద సభ్యులు సుశీల, వాణిశ్రీ, పోలీస్ అక్క ఏఎస్సై జయలక్ష్మి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**ఆదిలాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు, భూ సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. అనంతరం పదవీ విరమణ చేసిన ట్రెజరీ అండ్ అకౌంట్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర రాజు దంపతులను కలెక్టర్ శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అలాగే 'పోషణ్ అభియాన్'లో భాగంగా 'పోషణ్ చర్చా యాప్' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, డి.ఆర్.ఓ. స్రవంతి, ఏ. ఓ. ఎస్తేర్ వర్ణ,డి. ఎం. ఎహ్. ఓ. డా. సాధన వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే కార్మికుల సమస్యల పరిష్కారం

**మందమర్రి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**



కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ చేపట్టిన పోరాటం ఫలితంగానే సింగరేణి యాజమాన్యం పలు డిమాండ్లను పరిష్కరించేందుకు అంగీకరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం మందమర్రి ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మె నోటీసు ప్రభావంతో యాజమాన్యం చర్చలకు వచ్చిందన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. సర్వీసులో ఉండగా సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని, మరికొన్ని కీలక డిమాండ్లపై కూడా ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శైలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, భీమనాథుని సుదర్శన్, సోమిశెట్టి రాజేష్, కంది శ్రీనివాస్, పెద్దపెల్లి బానయ్య, ఎగ్గేటి రాజేశ్వరరావు, గాండ్ల సంపత్, సీహెచ్‌పీ శర్మ, కలువల శ్రీనివాస్, పారి పెల్లి సంజీవ్, పంగ చంద్రశేఖర్, ఊరకొండ శ్రీకాంత్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల సంక్షేమమే మా పార్టీ ధ్యేయం

- మీ కోడలిగా వచ్చా ఆశీర్వదించండి
- తండ్రి, బిడ్డను విడదీసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి నా ఉసురు తగులుతుంది
- పాంచజన్య సభలో కన్నీరు పెట్టిన కవిత



**నిజామాబాద్ ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సబ్బండ వర్గాల సంక్షేమమే తెలంగాణ రక్షణ సేన పార్టీ ధ్యేయమని కల్వకుంట్ల కవిత అన్నారు. మీ కోడలిగా నిజామా బాద్ కు వచ్చానని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఆమె కోరారు. టిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు తర్వాత తొలిసారిగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు. మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తండ్రి, బిడ్డను విడదీశారని ఆయనకు నా ఉసురు తగులుతుందని ఆమె అన్నారు. ప్రశాంత్ రెడ్డి ఎదుగుదలకు తాను ఎంతో కృషి చేశానని, మంత్రిగా ఎదగడానికి నా పాత్ర ఉందని అన్నారు. కానీ ఆయన మహాభారతంలో శకుని లాగా తండ్రి కూతుర్ని విడదీశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నన్ను నా తండ్రి కి దూరం చేయడానికి ప్రశాంత్ రెడ్డి కీలకపాత్ర పోషించారని ఆమె ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన నెలరోజులకే వేముల ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరేందుకు అమెరికాలో రాయబారం నడిపారని ఆక్షేపించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా కాంగ్రెస్తో చేతులు కలిపి అక్రమస్తులను కూడ పెట్టుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలపై బీఆర్ఎస్ పార్టీ ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. ఎన్నో హామీలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజులైనా ఒక్క హామీ నెరవేర్చకుండా తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పై ఇకనుండి నా పోరాటం సాగుతుందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మళ్లీ పోటీ చేస్తే చిత్తుగా ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ లో ఐదు నియోజకవర్గాల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. ఇకనుంచి భయపడే రోజులు పోయాయని తెలంగాణ ప్రజల కోసం పోరాడేందుకు సిద్ధమై మీ ముందుకు వచ్చానన్నారు. ఏడు ఏళ్లుగా నిజామాబాద్ ఎంపీగా ఉండి ధర్మపురి అరవింద్ మాధవ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఒక్క పైసా నిధులు కూడా తీసుకురాలేదన్నారు. గతంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు కమిషన్లు తీసుకున్నట్టు ఆరోపణలు చేసిన ఎంపీ అరవింద్ మాధవ్ నగర్ బ్రిడ్జికి ఎంత కమిషన్ తీసుకుంటున్నాను ప్రజలకు చెప్పాలని కవిత సవాల్ విసిరారు. తప్పుడు కేసులో ఇరికించి తీహార్ జైలుకు పంపిన, నాలుగేళ్లు సిబిఐ, ఈడి ఇబ్బందులు పెట్టిన ధైర్యంతో బయటకు వచ్చానన్నారు. తప్పుడు కేసు అని సుప్రీంకోర్టు జడ్జి సీబీఐ, ఈడికి గడ్డి పెట్టారని ఆమె ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.. కొత్త వాళ్లతో పార్టీ ఏర్పాటు చేశామని తమను గెలిపించి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాలని ఆమె సూచించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్పొరేట్ విద్య, వైద్యం తో పాటు యువతకు 20 కోట్ల వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 2 లక్షల కోట్ల ఆదాయం సమకూర్తుందని, నిధుల కోసం కేంద్రం వద్ద చేతులు చాపల్సిన అవసరం లేదన్నారు. 22ఏ అమలు చేసి పేదల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని కవిత ఆరోపించారు. జిల్లాలోని ఎన్ఎస్ఎఫ్, ఎన్సిఎస్ఎఫ్ ఫ్యాక్టరీలను తెరిపించడం కోసం పోరాటం సాగిస్తామన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో నీతి, నిజాయితీ కలిగిన పరిపాలన అందిస్తామని, పేదల కన్నీళ్లు తుడిచేటోళ్ళమని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తమకు పదవులు ముఖ్యం కాదని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని అన్నారు. బహుజన తెలంగాణ సాధన కోసం పనిచేస్తామన్నారు. జిల్లాలో ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డిలు గతంలో ఆస్తులు ఎన్ని ఇప్పటి ఆస్తులెన్నో ప్రజలకు వివరించాలని ఆమె ప్రశ్నించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జిల్లాలో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు మెడలో వేసుకోవడానికి తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. రైతు బోనస్ బోగస్ అయిందని, రైతు భరోసా ఆగమైందని ఆమె ధ్వజమెత్తారు. వచ్చే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో పోటీ చేసి తమ సత్తా చాటు తామని ఆమె అన్నారు. ఈ సభలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు అలీం భాయ్, నవీన చారి, లక్ష్మీనారాయణ భరద్వాజ్, నవీన్ రెడ్డి, విజయలక్ష్మి, ప్రవీణ్, టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






# ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

### సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...



**నిజామాబాద్ ఆగస్టు 31: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, రాజేందర్, విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**నిజామాబాద్, ఆగస్టు 31 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాదిగ హక్కుల సాధనకై నిరంతర పోరాటం



**లక్షెట్టిపేట, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
మాదిగ హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణను అమలు చేయడంతో పాటు రాజ్యాంగం, హక్కుల పరిరక్షణకు దళితులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సోమవారం లక్షెట్టిపేట పట్టణంలోని కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు దళితులకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు చిప్పకుర్తి మల్లేష్, సర్పంచులు లింగంపల్లి వెంకటేష్, ములకల్ల రాందాస్, కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ఎల్లారెడ్డి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండలం మేంగారం గ్రామ యువ కాంగ్రెస్ అధ్యక్షుడు తంత్రి గణేష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన మోహన్ సోమవారం గణేష్ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గణేష్ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గణేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, నాయకులు, సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



**ఎల్లారెడ్డి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. వేడుకలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహిళలు, యువత సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మోహన్‌రావు పాటిల్



**నిర్మల్ - ముధోల్: ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ముధోల్ మండల చింతకుంట గ్రామ సర్పంచ్ గంగాధర్ తండ్రి గంగారం ఇటీవల మృతి చెందడంతో ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, గ్రామ కార్యకర్తలు,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కళలు, కళాకారులకు గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం



**మందమర్రి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
స్థానిక కళలు, కళాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా తెలుగు సాంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్, తెలంగాణ సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ కృషి చేస్తున్నాయని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ది సిటీ పార్క్ హోటల్‌లో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రధానోత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, సాహితీ వేత్తలు, సామాజిక సేవకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని వివిధ పురస్కారాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.
జర్నలిస్టుల విభాగంలో మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన జాడ క్రాంతికుమార్ (టైమ్స్ ఆఫ్ వార్త)కు జాతీయ పురస్కారం--2026 అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, నిష్పక్షపాత సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సాహితీ సామ్రాట్ సూరేపల్లి విజయ తో నిర్వాహకులు మాచవరం గౌరీశంకర్, మాచవరం నరసింహ సాయి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 31 (తెలంగాణ వాణి విలేకరి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి  మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం కార్యాలయం లో నిర్వహించబడింది. ప్రజల నుండి 4 వరకు వినతులులను స్వీకరించారు. వినతులు రెవెన్యూ డిపార్ట్మెంట్ కి 2, ఆర్టీసీ-1, పంచాయతీ రాజ్1 చొప్పున వచ్చాయి.వాటిని సంబంధిత శాఖలకు పంపడం జరిగింది. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సిహెచ్ గణేష్ అదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దర్ వరప్రసాద్, ఎంపీఓ రామకృష్ణ రాజు,ఎస్సై నవీన్ కుమార్,ఎంఈఓ బండారి మధు, వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మండల స్థాయిలో గల 23 శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణ అందరి బాధ్యత

### బేటీ బచావో--బేటీ పడావోలో భాగంగా రాఖీ వేడుకలు



**మెదక్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బాలికల రక్షణ, విద్య, సమానత్వం, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో రాఖీ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులకు రాఖీలు కట్టి బాలికల రక్షణకు మద్దతుగా నిలవాలని సందేశం ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, విద్యను ప్రోత్సహించడం, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాలికల హక్కులు, భద్రత, భవిష్యత్ అభివృద్ధికి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, విద్యార్థినులు, అధికారులు, సిబ్బంది పాల్గొని "బాలికలను రక్షిద్దాం--బాలికలను చదివిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశారు.

## జమ్మికుంటలో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### తహసీల్దార్‌కు సీపీఐ(ఎం) వినతిపత్రం



**జమ్మికుంట, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మండలంలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణం, గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జమ్మికుంట మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పర్లపల్లిలో ఉక్కిరిబిక్కిరి

### హరిత ఫ్యాక్టరీ కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు





**తిమ్మాపూర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలోని హరిత లిక్కర్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న ధూళి, బూడిదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంధన మార్పు తర్వాత కాలుష్యం మరింత పెరిగిందని, గాలి, నీరు కలుషితమవుతున్నాయని ఆరోపిస్తున్నారు.ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న బూడిద ఇళ్లపై పేరుకుపోతోందని, పంటలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు తెలిపారు. చిన్నారులు, వృద్ధులు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉదయం వేళల్లో వింత వాసనలు వస్తున్నాయని, దుమ్ము కళ్లలో పడటంతో మంట, ఇతర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామానికి చెందిన శ్రీనివాస్ తెలిపారు. కాలుష్యంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గ్రామస్తులు ఆరోపించారు. కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు వెంటనే స్పందించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పర్లపల్లి ప్రజలు కోరుతున్నారు.

# బాబోయ్ సిలిండర్ సేల్స్ బాయ్..!!

- **సరఫరా అంతరాయాలతో వినియోగదారులకు ఇబ్బందులు**
- **సిలిండర్ డెలివరీ బాయ్‌ల తీరుతో తీవ్ర సమస్యలు**
- **ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు**



**జగిత్యాల:ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గ్యాస్ సిలిండర్ల సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయాలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిలిండర్ బుక్ చేసుకున్న అనంతరం నిర్ణీత సమయంలో డెలివరీ చేయకుండా జాప్యం చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయంలో సిలిండర్ అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మరోవైపు కొంతమంది సిలిండర్ డెలివరీ బాయ్‌ల వ్యవహారశైలిపై కూడా వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకు సిలిండర్ తీసుకురాకపోవడం, అదనపు నగదు డిమాండ్ చేయడం, ఫోన్ చేసినా స్పందించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. డెలివరీకి సంబంధించి సమస్యలు తలెత్తినప్పుడు డిస్ట్రిబ్యూటర్లను సంప్రదించి ఫిర్యాదు చేస్తున్నా సరైన స్పందన లభించడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. గ్యాస్ సరఫరా సంస్థలు, డిస్ట్రిబ్యూటర్లు ఈ సమస్యలపై దృష్టి సారించి సిలిండర్లను సకాలంలో వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డెలివరీ సిబ్బంది తీరుపై వచ్చిన ఫిర్యాదులను విచారించి, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర సేవగా భావించే వంటగ్యాస్ సరఫరాలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు.

**యుద్ధ ప్రభావంతో గ్యాస్ కొరత.. డెలివరీ బాయ్‌ల ఇష్టారాజ్యం?**
**నిబంధనలు, సరఫరా కొరతను సాకుగా చేసుకుని వినియోగదారులపై దురుసు వైఖరి**

అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో కొంత అంతరాయం, కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో కొందరు గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్‌లు మరింత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సరఫరా పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సిలిండర్ కోసం ముందస్తుగా బుకింగ్ చేసుకున్నప్పటికీ సమయానికి డెలివరీ చేయకపోవడం, వివిధ కారణాలు చెబుతూ వినియోగదారులను తిప్పుకోవడం, అదనపు డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. డెలివరీ బాయ్‌ల తీరుపై వినియోగదారులు డిస్ట్రిబ్యూటర్లకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**గ్యాస్ డెలివరీ బాయ్‌ల తీరుపై వినియోగదారుల్లో ఆగ్రహం**
**ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ విమర్శలు**

జగిత్యాల పట్టణంలోని ఓ ప్రముఖ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వద్ద పనిచేస్తున్న కొందరు సిలిండర్ డెలివరీ బాయ్‌లు వినియోగదారుల పట్ల అతిగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిలిండర్ డెలివరీ విషయంలో తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంపై డిస్ట్రిబ్యూటర్ నిర్వాహకులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ సమస్యను పట్టించుకోవడం లేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు. తమపై ఎవరూ చర్యలు తీసుకోలేరన్న ధీమాతో కొందరు డెలివరీ బాయ్‌లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ డెలివరీ వ్యవస్థపై పర్యవేక్షణ పెంచి, వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.యుద్ధ పరిస్థితుల కారణంగా సరఫరాలో ఇబ్బందులు ఉంటే వినియోగదారులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లపై ఉందని పలువురు పేర్కొంటున్నారు. కొరత పరిస్థితిని ఆసరాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న డెలివరీ సిబ్బందిపై అధికారులు, సంబంధిత గ్యాస్ సంస్థలు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు..

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్



**మెదక్ జిల్లా, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 48 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో భూ భారతి 16, ఇందిరమ్మ ఇళ్లకు 6, పెన్షన్‌కు 1, ఇతర సమస్యలకు సంబంధించి 25 దరఖాస్తులు ఉన్నాయి. ఈ సందర్భంగా డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై అధికారులు స్పందించి, వినతులకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# వినియోగదారుల రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**కలెక్టర్‌కు వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ వినతి**



**భువనగిరి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి విలేకరి):**
యాదాద్రి భువనగిరి జిల్లాలో వినియోగదారుల రక్షణ చట్టం--2019ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మకు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ జిల్లాలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ సెల్, వినియోగదారుల విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో నాణ్యత లేని వస్తువులు, ప్యాకింగ్ చేసిన తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రయాణికులకు మెరుగైన మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటి ప్రతినిధి కొడారి వెంకటేష్ పాల్గొన్నారు.

# యశ్వంతరావుపేటలో అభివృద్ధి పనులకు భూమిపూజ



**జగిత్యాల/బుగ్గారం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి విలేకరి):**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో నూతన వీఓ సంఘ భవనం, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు.
అలాగే ఎనిమిదో వార్డు ప్రజల కోరిక మేరకు బోరుబావి నిర్మాణానికి కూడా భూమిపూజ నిర్వహించారు. మంత్రి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ ఉరిమెట్ల లక్ష్మి--బుచ్చయ్య ఈ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్  కోల శ్రీనివాస్, గ్రామ సెక్రెటరీ, ఎంపీవో వార్డ్ మెంబర్స్ మహిళా సంఘాలు, ఆశ వర్కర్లు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

### సీపీఎం మండల కార్యదర్శి వేల్మారెడ్డి రాజిరెడ్డి



**శంకరపట్నం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వేల్మారెడ్డి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీనియర్ అసిస్టెంట్ రజినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శంకరపట్నం బస్టాండ్‌లో వర్షపు నీరు నిలవకుండా శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి చక్రపాణి, బండి తిరుపతి, దేవేందర్‌రెడ్డి, కొమరయ్య, బుచ్చయ్య, వెంకటేష్, సమ్మయ్య తదితర సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 9 అర్జీలు

**కోరుట్ల రూరల్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 9 అర్జీలు అందినట్లు ఎంపీడీవో వోదెల రామకృష్ణ తెలిపారు. రెవెన్యూ శాఖకు 3, మున్సిపాలిటీకి 2, విద్యాశాఖకు 1, గృహ నిర్మాణ శాఖకు 2, ఆర్టీసీ డిపో మేనేజర్‌కు 1 అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వెంకంపల్లి శివారులో చిరుత సంచారం



**నాగిరెడ్డిపేట, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
నాగిరెడ్డి పేట మండలం వెంకంపల్లి గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున చిరుత సంచారం కలకలం రేపింది. పొలానికి వెళ్తున్న రైతు సత్యనారాయణకు చిరుత కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు పరిశీలించగా సమీపంలోని గుట్ట వైపు వెళ్లిన ఆనవాళ్లు గుర్తించారు. దీంతో అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత కనిపిస్తే వెంటనే అటవీశాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

## ప్రజావాణికి రెండు ఫిర్యాదులే......



**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 31:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డి పేట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించినటువంటి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు . ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ప్రజావాణి కార్యక్రమానికి వ్యవసాయ అధికారి సాయికిరణ్, ఎంపీఓ ప్రభాకర్ చారి , ఎంఈఓ వెంకటరెడ్డి , ఏపీఎం సక్కుబాయి, ఐకెపి ఎపిఎం దత్తు, మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## మోడల్ స్కూల్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని విద్యార్థుల ధర్నా



**కోరుట్ల రూరల్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలం కల్లూరు మోడల్ స్కూల్ విద్యార్థులు సోమవారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం ఒకే బస్సు ఉండటంతో వంద మందికి పైగా విద్యార్థులు పరిమితికి మించి ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న డిపో మేనేజర్, ఎస్సై శ్యామ్‌రాజ్ అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఫోన్‌లో విద్యార్థులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మాణం

### చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకుడి ఫిర్యాదు



**నారాయణఖేడ్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నారాయణఖేడ్ మండలం పీర్లతాండా వద్ద ప్రభుత్వ అసైన్డ్ భూమిలో నుంచి అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అనుముల తుకారాం కోరారు. సోమవారం ఖేడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సబ్‌కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుకారాం మాట్లాడుతూ.. పీర్లతాండా వద్ద సర్వే నంబర్ 120/50లోని అసైన్డ్ భూమి నుంచి సుమారు 40 అడుగుల వెడల్పుతో ఫామ్‌ల్యాండ్ కోసం రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపి ంచారు. గతంలో అధికారుల ఆదేశాలతో పనులు నిలిపివేసినా తిరిగి కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై పాతులోత్ ప్రేమ్‌సింగ్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్న వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని తుకారాం డిమాండ్ చేశారు.

## ధర్నాలు.... రాస్తారోకోలు.. ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

### జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్



**సంగారెడ్డి :ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు 30, 30(ఎ) పోలీస్ చట్టం 1861 ప్రకారం సెప్టెంబర్ 1వ తేది నుంచి 30వరకు అమలులో ఉంటుందని సూచించారు. జిల్లా పరిధిలో ముందస్తు పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, మైకు పెట్టుకుని తిరగడం, సభలు, సమావేశాలు, నిరాహార దీక్షలు నిర్వహించరాదన్నారు. ప్రజా ధనానికి నష్టం కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని ఎస్పీ స్పష్టంచేశారు.జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు నిర్వహించే నిఘా, బందోబస్తుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. ఒకవేళ పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## రాయిని చెరువు మరమ్మతులకు వినతి



**తిమ్మాపూర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలోని దెబ్బతిన్న రాయిని చెరువు మత్తడి, కట్టకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఏడేళ్ల క్రితం భారీ వర్షాలకు మత్తడి కొట్టుకుపోవడంతో పాటు కట్ట దెబ్బతిందని తెలిపారు. దీంతో చెరువులో నీరు నిల్వ ఉండక మత్స్యకారులు, సుమారు 1,500 మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొట్టిముక్కుల సంపత్‌రెడ్డి, మత్స్యకార సంఘ ఉపాధ్యక్షుడు గిరివేణి శ్రీనివాస్, డైరెక్టర్లు కీసర వెంకటేష్, పిట్టల తిరుపతి, జక్కుల మధు, కీసర సంపత్, కీసర నరేష్, పిట్టల సమ్మయ్య, కీసర కొమురయ్యతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వినియోగదారుల రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### కలెక్టర్‌కు వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ వినతి



**భువనగిరి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి విలేకరి):**
యాదాద్రి భువనగిరి జిల్లాలో వినియోగదారుల రక్షణ చట్టం--2019ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ జిల్లాలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ సెల్, వినియోగదారుల విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో నాణ్యత లేని వస్తువులు, ప్యాకింగ్ చేసిన తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధి కొడారి వెంకటేష్ పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

### సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు హుజూరాబాద్‌లో వారం రోజుల నిరసనలు



**హుజూరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. సోమవారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ఎన్నికల హామీల అమలుపై ఒత్తిడి తెచ్చేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'సమరభేరి' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

## కొమురవెల్లి మండల కాంగ్రెస్ కమిటీ నియామకం

### మరోసారి మండల అధ్యక్షుడిగా మహాదేవుని శ్రీనివాస్



**కొమురవెల్లి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తూముకుంట అంక్షారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మహాదేవుని శ్రీనివాస్‌ను మరోసారి నియమించారు.ఆయనతో పాటు ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఆరుగురు కార్యదర్శులు, ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. మొత్తం 21 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు తూముకుంట అంక్షారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజా సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## రసాయన శాస్త్రంలో వై.రాజేందర్ రెడ్డికి పీహెచ్.డీ.



**పటాన్ చెరు, ఆగస్టు 31, (తెలంగాణ వాణి)**
హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వై. రాజేందర్ రెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'లక్షిత ఆంకాలజీ ఔషధాలైన ఇబ్రూటినిబ్, బుసుల్ఫాన్, లాపటినిబ్, రుక్సోలిటినిబ్ లలో మలినాల ప్రొఫైలింగ్, నిర్మాణ వివరణ కోసం అధునాతన విశ్లేషణాత్మక పద్ధతుల'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ రాజేందర్ రెడ్డి పరిశోధన, ఇబ్రూటినిబ్, బుసల్ఫాన్, లపాటినిబ్, రుక్సోలిటినిబ్ అనే నాలుగు ముఖ్యమైన ఆంకాలజీ ఔషధాలపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. వాటి స్థిరత్వాన్ని అంచనా వేయడానికి, విచ్ఛిన్న ఉత్పత్తులను, ప్రక్రియ-సంబంధిత మలినాలను గుర్తించడానికి, ఇంకా వాటి నిర్మాణాలను విశ్లేషించడానికి అధునాతన విశ్లేషణాత్మక పద్ధతులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఎల్ సీ ఎం ఎస్, ఎచ్ ఆర్ ఎం ఎస్ (ఎ=మీా), ఎన్ ఏం ఆర్ (చీవీ=) ప్రిపరేటివ్ క్రోమాటోగ్రఫీలను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ అధ్యయనం మలినాలు ఏర్పడటానికి గల సంభావ్య యంత్రాంగాలను కూడా స్థాపించిందన్నారు. ఇది ఔషధ భద్రత, నాణ్యత, నియంత్రణలను మెరుగుపరచడానికి దోహద పడినట్టు వివరించారు. ఈ పరిశోధన, విశ్లేషణాత్మక ఖచ్చితత్వాని కి ఎటువంటి రాజీ పడకుండా, నమూనా పూర్వ-శుద్ధీకరణ, సంక్లిష్ట సంగ్రహణ ప్రక్రియలను తగ్గించడం ద్వారా, సరళమైన, తక్కువ ఖర్చు, పర్యావరణ స్పృహతో కూడిన విశ్లేషణాత్మక విధానాన్ని మరింత వెల్లడించిందన్నారు. డాక్టర్ రాజేందర్ రెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

## ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రూ.3.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, ఆగస్టు 31, (తెలంగాణ వాణి)**
ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ లోని ప్రతి వార్డులో మౌలిక వసతులను మెరుగు పరుస్తూ, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇస్నాపూర్, చిట్కుల్, లకడారం వార్డుల్లో రూ.3 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా మున్సిపాలిటీ లోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత



ఇస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, విజ్ఞప్తులను పరిగణన లోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**నాణ్యతతో.. వేగంగా పనులు**
శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, పాండు, నరేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, సంధ్య నవీన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్, ఈశ్వరమ్మ, జనార్ధన్ రెడ్డి, ఆంజనేయులు, మమత అరుణ్, రాజు, లత వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సోనియా రాజు, నిజాముద్దీన్ బాబా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేరాజ్ ఖాన్, కార్యకర్తలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## లోటస్ ఫార్మ్‌ల్యాండ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

### రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిపివేయాలని తహసీల్దార్‌కు బీఎస్పీ నేత వినతి



**నారాయణఖేడ్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామ పరిధిలోని లోటస్ ఫార్మ్‌ల్యాండ్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులపై స్పష్టత వచ్చే వరకు రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేయాలని బీఎస్పీ నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అనుముల తుకారాం కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుకారాం మాట్లాడుతూ సుమారు 50 ఎకరాల్లో గేటెడ్ కమ్యూనిటీ పేరుతో ఫార్మ్‌ల్యాండ్ ప్రాజెక్టును ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రూ.18 లక్షలకు 1,210 గజాల ప్లాట్‌తో పాటు 1బీహెచ్‌కే ఫార్మ్‌హౌస్, రిసార్ట్, వీకెండ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పరిస్థితులు ప్రచారానికి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. భూమి స్వరూపం, రెవెన్యూ రికార్డులు, భూ వినియోగం, ప్లాట్ల విక్రయాలకు అవసరమైన అనుమతులు, నిర్మాణాలకు సంబంధిత శాఖల అనుమతులపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ప్రాజెక్టుకు రహదారి, రాకపోకలు, ఇతర మౌలిక వసతులపై కూడా క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విచారణ పూర్తయ్యే వరకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం జరిగినట్లు తేలితే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తుకారాం కోరారు.

## పంచాయతీ కార్యదర్శిపై వీహెచ్‌పీ, బీజేపీ శ్రేణుల ఆగ్రహం

**కార్మికులకు నోటీసులు ఇవ్వడంపై అభ్యంతరం**



**ధర్మారం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామపంచాయతీ కార్మికులకు రాఖీ పండుగ రోజు విధులకు హాజరుకాలేదనే కారణంతో నోటీసులు జారీ చేయడంపై వీహెచ్‌పీ, బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శి ఎండీ నయీమ్‌ను నిలదీశారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో వేముల సుమలత కార్యాలయానికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. అనంతరం కార్యదర్శి నయీమ్ కార్మికులకు క్షమాపణలు కోరినట్లు తెలిపారు. కార్మికులపై వేధింపులు ఆపాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శశిపెల్లి రవీందర్ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు మేడవేణి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లక్ష్మణ్, విశ్వహిందూ పరిషత్ నాయకులతో పాటు కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూనమల్ల అశోక్, మండల అధ్యక్ష కార్యదర్శులు శాతరాజుల గంగాధర్, ఏదుల్ల రవికుమార్, నవీన్, వెంకటేష్ శంకరయ్య, రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి వెంట చికెన్, కూరగాయల వ్యర్థాలు తొలగించాలి

### దుర్వాసనతో ప్రజల అవస్థలు.. కుక్కల దాడులతో వాహనదారుల ఇబ్బందులు




**శంకరపట్నం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
శంకరపట్నం మండలం కేశవపట్నం నుంచి మఖ్త, ముత్తారం, కన్నాపూర్, రాజాపూర్, గద్దపాక, బొంతుపల్లి తదితర గ్రామాలకు వెళ్లే రహదారి వెంట పేరుకుపోయిన చికెన్, కూరగాయల వ్యర్థాలను తొలగించాలని మఖ్త గ్రామ సర్పంచ్ నెలవేణి మహేష్ అధికారులను కోరారు. సోమవారం మండల ప్రజావాణిలో ఆయన అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రహదారి ఇరువైపులా వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వస్తోందని, చికెన్ వ్యర్థాల కోసం రోడ్డుపైకి వస్తున్న కుక్కలు పాదచారులు, వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించి, ఇకపై రహదారి వెంట వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



## రుద్రారం పాఠశాలలో వినూత్న కార్యక్రమం

### రోజూ 10 పదాల డిక్టేషన్.. నెలవారీ విజేతకు రూ.100 నగదు బహుమతి

**పటాన్‌చెరు, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
విద్యార్థుల్లో చదవడం, రాయడం, జ్ఞాపకశక్తిని పెంపొందించడంతో పాటు హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు పటాన్‌చెరు మండలం రుద్రారం ప్రాథమిక పాఠశాలలో వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ)లో భాగంగా ప్రతిరోజూ విద్యార్థులకు 10 పదాల డిక్టేషన్ నిర్వహిస్తున్నారు. ప్రతినెలా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.100 నగదు బహుమతి అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో చదవడం, స్పష్టంగా రాయడం, పదాలను గుర్తుంచుకోవడం, పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడుతోందని ఉపాధ్యాయులు తెలిపారు. తరగతి ఉపాధ్యాయుడు నరసింహులు ఆధ్వర్యంలో, ప్రధానోపాధ్యాయుడు అనుముల రామచందర్ పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగుతోంది. ఉపాధ్యాయులు సుసంగీత, విజయలక్ష్మి, రఘురామ్‌రెడ్డి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

## గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా అవార్డ్ అందుకున్న మొగిలి మాల



**పటాన్ చెరు, జిన్నారం, ఆగస్టు 31, (తెలంగాణ వాణి);**
శనివారం సాయంత్రం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు భాషాభివృద్ధికై అహర్నిశలు కృషి చేసి , తన జీవితాన్ని త్యాగం చేసిన వారు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా.. కవి సమ్మేళనంలో పాల్గొన్న జిన్నారం మండల పరిధిలోని కొదకంచి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మొగిలి మాల అవార్డ్, అందుకున్నారు. టీ డీ పీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు పి.డి. జనార్దన్ తో పాటు గిడుగు వారి ముని మనవరాలు క్రాంతి కృష్ణ, ల బిక్కి కృష్ణ, ల చేతుల మీదుగా జ్ఞాపిక , ప్రశంసా పత్రం , శాలువాతో సన్మానం అందుకున్నారు. ఈ కార్య క్రమంలో నవ్యాంధ్ర సంఘం తెలుగు కవులు తదితరులు పాల్గొన్నారు.

## 25 కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



**పటాన్‌చెరు, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
పటాన్‌చెరు పట్టణంలో 19వ వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన 25 కిలోమీటర్ల పాదయాత్రలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పాల్గొన్నారు. జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విశ్వశాంతి, ప్రజల్లో ప్రేమ, అనురాగం, ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం లింగాయత్ సమాజం సభ్యులు ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్‌తో పాటు సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి, మాజీ సర్పంచుల పోరం రాష్ట్ర అధ్యక్షుడు డోకూరు రాంమోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజం సభ్యులు అశోక్, రాజు, దేవ, యువరాజ్, సాయి, వీరేశం పాల్గొన్నారు.

## పాముకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం



**రాజాపేట, ఆగస్టు 31 (తెలంగాణ వాణి విలేకరి):**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పాముకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సత్యానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, రాజాపేట మండల విద్యాధికారి చందా రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా చందా రమేష్ తన 37 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయ వృత్తి గొప్పతనాన్ని వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయన సేవలను కొనియాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జెల్ల ప్రభాకర్, కోటి రెడ్డి రిటైర్డ్ మారోజు శశికుమార్, రవీంద్రా రెడ్డి బత్తిని పరమేశ్ పాఠశాల సిబ్బంది గౌటె బాలరాజు, శ్రీనివాస్ గణేష్ నారాయణ పారిజాత విజయలక్ష్మి రమాదేవి ప్రభ, శ్రీవిద్య ప్రాథమిక పాఠశాల ఇంచార్జీ హెచ్ఎం బండకింది బాలరాజు ఎం ఆర్ సి సిబ్బంది వెంకట రెడ్డి, అశోక్,సత్యం స్వప్న సంధ్యా రాణి కిరణ్ పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి మృతి



**కోరుట్ల రూరల్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన అల్లెపు రమేష్ (35) సోమవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నెల రోజుల క్రితం దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చిన రమేష్ కొంతకాలంగా మద్యానికి బానిసై మానసిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం భార్య ఇద్దరు పిల్లలతో తల్లి ఇంటికి వెళ్లగా, సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రమేష్ ఈ ఘటనకు పాల్పడినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మానవత్వం చాటిన సర్పంచ్

**పటాన్ చెరు, ఆగస్టు 31, (తెలంగాణ వాణి)**
పటాన్ చెరు మండలం లోని నందిగామ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న లక్కి కుమార్, తండ్రి గుంజన్ కుమార్ ఈ రోజు ఉదయం మరణించారు. బీహార్ కు చెందిన గుంజన్ కుమార్ కు బంధువులు ఎవరు లేనందున, అనాథలుగా ఏడుస్తున్న ఆ కుటుంబ సభ్యుల రోదనల ను గమనించిన ఆ గ్రామ సర్పంచ్ ఎల్ల గోని విక్రం గౌడ్, ఉప సర్పంచ్ గోరెమియ లు వారిని ఓదార్చి, మానవతా హృదయంతో గుంజన్ కుమార్ ఆంత్యక్రియల ను నిర్వహించారు. సర్పంచ్ సహకారానికి స్కూల్ సిబ్బంది శైలజ, కళ్యాణి, శారద, సత్యనారాయణ,లు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.

## మైనర్ బాలికను కిడ్నాప్ ఛేదించిన పటాన్ చేరు పోలీసులు

**పటాన్ చెరు, ఆగస్టు 31, (తెలంగాణ వాణి)**
పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధి లోని పోచారం గ్రామ శివారులో గల సాయి దర్శన్ కాలనీలో వాచ్‌మెన్ డ్యూటీ చేసుకుంటూ కుటుంబంతో కలిసి నివసిస్తున్న 17 సంవత్సరాల మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన ఘటనపై పటాన్ చెరు పోలీసులు వెంటనే స్పందించి బాలికను సురక్షితంగా గుర్తించి భరోసా సెంటర్ కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం, రామేశ్వరం బండ మండలంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మహ్మద్ అలీమ్ పాషా, తండ్రి అబ్దుల్లా, వయస్సు 24 సంవత్సరాలు, తన స్నేహితులైన ముద్దం రాజు, వడ్డే రాజేష్ ల తో కలిసి మైనర్ బాలిక నివసిస్తున్న గుడిసె వద్దకు వెళ్లాడు. అక్కడ బాలిక తల్లిదండ్రులను కట్టెలు, బీర్ సీసాల తో కొట్టి, అడ్డుకోవడానికి వచ్చిన బాలిక చిన్న చెల్లెలి పై కూడా దాడి చేసి, అనంతరం మైనర్ బాలికను బలవంతంగా తీసుకెళ్లినట్లు ఫిర్యాదు అందింది. సమాచారం అందిన వెంటనే పటాన్ చెరు పోలీసులు త్వరితగతిన స్పందించి మైనర్ బాలిక ఆచూకీని గుర్తించి, ఆమెను రక్షించి భరోసా సెంటర్ కు తరలించారు. విచారణలో నిందితుడు మైనర్ బాలికను మోస పూరితమైన మాటలతో నమ్మించి, పలుమార్లు ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. మైనర్ బాలిక భద్రత, గోప్యతను దృష్టిలో ఉంచుకుని ఆమె వివరాలను బహిర్గతం చేయడం లేదన్నారు. మైనర్ బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్ చెరు పోలీసులు హెచ్చరించారు. త్వరలో నేరస్తులను పట్టు కొనుటకు రెండు బృందాలను పంపినట్లు పటాన్ చెరు ఇన్స్ పెక్టర్ రవీందర్ తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా దిబ్బెందల సాయికుమార్



**జూలూరుపాడు, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
జూలూరుపాడు మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా దిబ్బెందల సాయికుమార్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జి చెంగల గురునాథం మాదిగ అధ్యక్షతన నూతన కమిటీ నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు.మండలంలోని ఏడు మాదిగ గ్రామాల అధ్యక్షులు, గ్రామ కమిటీల ఏకగ్రీవ తీర్మానం మేరకు సాయికుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు గురునాథం తెలిపారు. సంఘాన్ని మండలంలో మరింత బలోపేతం చేసి, మాదిగల హక్కుల సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కృషి చేస్తామని సాయికుమార్ తెలిపారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా గార్లపాటి నవీన్, ప్రధాన కార్యదర్శిగా దొంగల సృజన్, సహాయ కార్యదర్శిగా పోతురాజు అనిల్‌కుమార్, అధికార ప్రతినిధిగా గార్లపాటి నిఖిల్, కోశాధికారిగా ఉబ్బపల్లి నరసింహారావు, కార్యవర్గ సభ్యుడిగా జంగం నాగరాజు ఎన్నికయ్యారు.

## టేకులపల్లి ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

### ఎంపీడీవోకు ఉపాధ్యాయ సంఘాల జేఏసీ వినతి



**టేకులపల్లి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## పోడు భూములకు పూర్తి స్థాయి పట్టాలు ఇవ్వాలి

### ఐటీడీఏ పీఓకు సేవాలాల్ సేన వినతి

**టేకులపల్లి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి మండలంలోని గిరిజన రైతుల పోడు భూములకు సమగ్ర సర్వే నిర్వహించి, ఆర్వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం పూర్తి స్థాయి యాజమాన్య హక్కుల పట్టాలు మంజూరు చేయాలని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ కోరారు. ఈ మేరకు భద్రాచలం ఐటీడీఏ పీఓను కలిసి వినతిపత్రం సమర్పించారు.గతంలో కొంతమంది రైతులకు జారీ చేసిన తాత్కాలిక మెమోలు చెల్లుబాటు కాకపోవడంతో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. వివాదాలు లేని ప్రతి పోడు భూమికి శాశ్వత పట్టాలు మంజూరు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



## నేత్రదానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపండి

### అదనపు కలెక్టర్ పి. శ్రీజ

**ఖమ్మం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపు అందించే అవకాశం ఉందని అదనపు కలెక్టర్ పి. శ్రీజ తెలిపారు. 41వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ కళ్లద్దాలు వాడేవారు, మధుమేహం, బీపీ, ఆస్తమా ఉన్నవారు, కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. కొన్ని నిర్దిష్ట వ్యాధులతో మరణించిన వారు మాత్రమే నేత్రదానానికి అనర్హులని పేర్కొన్నారు. మరణించిన వ్యక్తి నుంచి 6--8 గంటల్లోపు నేత్రాలను సేకరించాల్సి ఉంటుందని, మరణించిన వెంటనే కళ్లను మూసి తడి గుడ్డ లేదా ఐస్ ఉంచి, తలను రెండు దిండ్లపై ఎత్తుగా ఉంచాలని



సూచించారు. నేత్రదానం వల్ల మృతదేహం ముఖాకృతిలో మార్పు ఉండదన్నారు. మరణం సంభవించిన వెంటనే ఖమ్మం నేత్రనిధికి సమాచారం అందించాలని కోరారు. నేత్రదానానికి సంబంధించిన వివరాల కోసం 9397191919, 9247571995 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. రామారావు, డిసిహెచ్ఎస్ డా.రాజశేఖర్, డిబిసిఎస్ డాక్టర్ బి.వెంకట నర్సయ్య, ఆప్తాలమిక్ సిబ్బంది ప్రవీణ్, నరేష్, కౌన్సిలర్ హరిప్రసాద్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

## ప్రజాసేవే పరమావధి.. సమగ్ర అభివృద్ధే లక్ష్యం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
ప్రజాసేవే పరమావధిగా, సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సోమవారం ప్రకాశ్‌నగర్‌లో కాటన్ మార్కెట్ నుంచి ప్రకాశ్‌నగర్ మీదుగా ఎస్‌వీఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ.12 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవుల కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల ఆకాంక్షలు, అవసరాల మేరకు సేవ చేస్తున్నానని అన్నారు. ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి పనుల ద్వారా నిలబెట్టుకుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో విద్య, వైద్యం,





రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.250 కోట్లు మంజూరు చేసిందని, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి 24 గంటల మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఖమ్మం పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలను ప్రజలు సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిర్దోషులు, పేదలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### -- అదనపు కలెక్టర్ పి. శ్రీజ

**ఖమ్మం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారి పాలన సమయంలో జరిగిన సుమారు రూ.9 లక్షల బిల్లుల చెల్లింపులపై విచారణ, ప్రత్యేక ఆడిట్ నిర్వహించి సెప్టెంబర్ 9లోగా నివేదిక సమర్పించాలని డిప్యూటీ సీఈవోను ఆదేశించారు. కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురానికి చెందిన పాశం నాగేశ్వరరావు తన కుమార్తెను లంకపల్లి బీసీ గురుకులం నుంచి రెబ్బవరం బీసీ గురుకులానికి మార్చాలని కోరగా, సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువుకు



చెందిన జోగుపర్తి బుచ్చమ్మ తన భర్త పేరున్న భూమిని తనకు తెలియకుండా కుమారుడు, కోడలు పేరుపై మార్చారని ఫిర్యాదు చేయగా, సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

### - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు

**కరీంనగర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు తెలిపారు.

**సెప్టెంబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల చార్జ్‌షీట్ విడుదల.**
సెప్టెంబర్ 2--4: ఆరు గ్యారంటీలు, రైతులు, వ్యవసాయం, భూ సమస్యలు, మహిళలు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమంపై నిరసనలు. సెప్టెంబర్ 5--6: విద్యార్థులు, యువత, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కార్యక్రమాలు, నియోజకవర్గాల వారీగా ర్యాలీలు, సదస్సులు. సెప్టెంబర్ 7--8: కాంగ్రెస్ 420 హామీల అమలుపై ప్రజల్లో చర్చలు, నిరసనలు, జిల్లా కేంద్రంలో విలేకరుల



సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని రామకృష్ణారావు పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## వీధి లైట్లు భగీరథ నీటిపై కౌన్సిలర్ ప్రత్యేక శ్రద్ధ

**వనపర్తి , ఆగస్టు 31, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి మున్సిపాలిటీ పరిధి లోని గణేష్ నగర్ వీధిలో 22వ వార్డు కౌన్సిలర్ ఏరువా అరుణ మెకానిక్ శీను కాలనీ వాసులకు నీళ్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. పైపులు సరిచేసి భగీరథ నీటి సమస్యను కౌన్సిలర్ తొలగించారు.వీధి లైట్ల నిర్వహణ, మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో జరుగుతున్న లోపాలపై స్థానిక కౌన్సిలర్ స్వయంగా రంగంలోకి దిగి పరిశీలించారు. వార్డు కౌన్సిలర్లు స్వయంగా లీకేజీ ప్రాంతాలను సందర్శించి, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు.కాలనీల్లోని ప్రధాన వీధుల్లో ఎల్ఈడీ లైట్లు, బాక్సులు పాడైపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిలర్లు తమ వార్డు పరిధిలో రాత్రి వేళల్లో పర్యటించి, ఎక్కడెక్కడ వీధి లైట్లు వెలగడం లేదో గుర్తించి



మున్సిపాలిటీల్లో కొత్త వీధి దీపాల మరమ్మతులు, కొత్త పోల్స్ ఏర్పాటు వేగవంతం చేశారు .కౌన్సిలర్ స్థానిక వార్డులోని ప్రజల మౌలిక వసతులైన తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంలో కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించారు. సమస్యలను పరిష్కరించిన కౌన్సిలర్ ను కాలనీవాసులు అభినందించారు.

## శిరీష మృతి ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలి

### బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

**టేకులపల్లి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చవిటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి, నర్సు ఊకె శిరీష మృతి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పలువురు ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. శిరీష మృతికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న సానద్ ఉల్లా ఖాన్‌పై నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. దర్యాప్తులో నేరం రుజువైతే చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం, తగిన పరిహారం, రక్షణ కల్పించాలని కోరారు. మహిళలు, ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహించే నర్సుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు.



## మహిళా సంఘాల ఫిర్యాదుపై విచారణకు ఆదేశం

### సీసీ నాగరాజు పనితీరుపై కలెక్టర్‌కు వినతి

**మల్హర్‌రావు, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి**



) మల్హర్‌రావు మండల మహిళా సమాఖ్య క్లస్టర్ కో-ఆర్డినేటర్ (సీసీ) నాగరాజు పనితీరుపై మహిళా సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.గత నాలుగేళ్లుగా మండలంలోని ఐదు గ్రామాల సమాఖ్యల్లో సీసీ నాగరాజు సక్రమంగా పర్యటించడం లేదని మహిళలు ఆరోపించారు. క్లస్టర్ పరిధిలోని 40 ఎఫ్‌డీజీ సంఘాలు, వీఓలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశాలకు హాజరుకాకపోవడంతో సంఘాలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ కార్యాలయం సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించింది. సీసీ పనితీరుపై విచారణ అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ప్రతినిధులు కోరారు.

## కట్టంగూరు పెద్ద చెరువు ఆక్రమణలపై విచారణ జరపాలి

### కలెక్టర్‌కు ఓబీసీ మోర్చా నేతల వినతి



**నకిరేకల్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
కట్టంగూరు మండలంలోని పెద్ద చెరువు ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమణలను తొలగించి చెరువు భూమిని స్వాధీనం చేసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కోమటి నరసింహ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింహ మాటా ్లడుతూ సుమారు 110 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువు సగానికి పైగా ఆక్రమణలకు గురైందని ఆరోపించారు. చెరువు భూమిని కొందరు ఆక్రమించి సాగు చేసుకోవడంతో పాటు మరికొందరు ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని తెలిపారు. చెరువులోకి నీరు వచ్చే కాలువలు సైతం ఆక్రమణలకు గురికావడంతో పూర్తిస్థాయిలో నీరు చేరడం లేదని పేర్కొన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి చెరువు హద్దులను నిర్ధారించాలని, ఆక్రమణలను తొలగించి చెరువు భూమిని పరిరక్షించాలని కోరారు. చెరువు కింద సాగు చేసే రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోమటి భాస్కర్, ఓరుగంటి హరిబాబు, చెరుకు నాగరాజు, బత్తిని నాగరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణపై బీఆర్ఎస్ పోరాటం : మాజీ మంత్రి జీవన్ రెడ్డి



ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అవకాశవాది అని, వాస్తవానికి అనుగుణంగా మాట్లాడాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జిల్లా పరిషత్ తొలి మాజీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను గెలిపించిన ఆరు నెలల్లోనే ఎమ్మెల్యే సంజయ్ అవకాశవాదంతో కాంగ్రెస్ వైపు వెళ్లారని తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ దయతో రెండు సార్లు ఎమ్మెల్యే అయిన సంజయ్, ఆయన దూరదృష్టితో జగిత్యాలకు తెచ్చిన అభివృద్ధిని, నూకపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నిర్మాణాన్ని మరవకూడదని హితవు పలికారు.

## దసరా నాటికి దేవాదుల సాగునీరు అందించేందుకు కృషి

**ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హత, పేదరికమే ప్రామాణికం : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



**జనగామ/తరిగొప్పుల, ఆగస్టు 31 (తెలంగాణ వాణి)**
దసరా నాటికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ చివరి నాటికి మోటార్ల ఏర్పాటు పూర్తి చేసి, అక్టోబర్ 15 నుంచి 20 మధ్య నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తరిగొప్పుల మండలం బొంతగట్టు నాగారం గ్రామంలో రూ.22 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వీఓ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన రహదారులు, మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు తావులేదని, అర్హత, పేదరికమే ప్రామాణికమని స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి ఎవరైనా లంచం అడిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దేవాదుల ప్రాజెక్టు పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తయ్యాయని, మోటార్ల ఏర్పాటుతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సాగునీరు అందితే ప్రస్తుత పంటతో పాటు యాసంగి పంటకు కూడా రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## డంపింగ్‌యార్డును తరలించాలి

**సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం**



**కరీంనగర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ నగరంలోని డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున దానిని వెంటనే తరలించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కమిషనర్ ఆయాజ్‌కు సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నగరంలోని అధ్వానంగా మారిన రోడ్లు, డ్రైనేజీలను వెంటనే బాగుచేయాలని, మున్సిపల్ నల్లాల ద్వారా నిత్యం తాగునీరు సరఫరా చేయాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు వట్టి జగదీష్, నాయకులు రోహిత్, పాతూరి లింగారెడ్డి, గుర్రం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## రిపోర్టర్ వలిని పరామర్శించిన టీజేఏ జిల్లా అధ్యక్షుడు షానూర్



**వలిగొండ, ఆగస్టు 31 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
వలిగొండ మండలానికి చెందిన సూర్య దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ నాగేల్లి వలి తండ్రి నాగేల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మొహమ్మద్ షానూర్ బాబా సోమవారం వలి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా షానూర్ మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఏ ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి యానాల సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట: ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నర్సంపేట మున్సిపల్ లోని పలు వార్డుల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నూతనంగా చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేసిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ ఈ సందర్భంగా చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు, స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాణాల ప్రసన్నశ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, సొసైటీ డైరెక్టర్ లాక్కార్సు రమేష్, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేష్, దేవజు సదానందం, వడ్డే కుమారస్వామి, వార్డు అధ్యక్షులు బిట్ల మనోహర్, గాజుల రాము, గోపు మహేందర్ రెడ్డి, ఆర్ఐ యూసఫ్, వీఆర్వో రవీందర్, నాయకులు ముదురబోయిన రాజు, స్వామిశెట్టి శేఖర్, చీకటి శివమణి, పాల్గొన్నారు..

# సీఎం సహాయనిధి పేదలకు పెన్నిధి

**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



**వనపర్తి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం పొందిన పేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తిలో రూ.45.31 లక్షల విలువైన 150 సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వారికి సీఎం సహాయనిధి ద్వారా చికిత్స అనంతరం ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1 నాటికి 1000 రోజుల పాలన పూర్తి చేసుకుంటోందని, సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. వనపర్తి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు మానవతా దృక్పథంతో సీఎం సహాయనిధి అందిస్తున్నామని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు అక్తర్,వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, సోషల్ మీడియా కోకో ఆర్డినేటర్ చంద్రశేఖర్, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున,వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, వనపర్తి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల చంద్రశేఖర్ , పెబ్బేర్ మండల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అనిల్, అయ్యవారిపల్లె సర్పంచ్ కురుమన్న,సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, సహదేవుడు, మన్యం యాదవ్, రాముడు, హరిబాబు రెడ్డి, ఇమ్రాన్, శ్రీధర్, వెంకటేష్ సాగర్, ఆనంద్ సాగర్, శివ నారాయణ, చెన్నయ్య, వెంకటేష్, నాగన్న గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, నరసింహ, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై సమరభేరి

**సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు ప్రజా ఉద్యమం : దాస్యం వినయ్ భాస్కర్**



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, (ఆగస్టు 01):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన వినయ్ భాస్కర్ పార్టీ శ్రేణులకు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎనిమిది రోజుల పాటు వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం వివిధ రంగాల్లో సాధించిన వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి



వివరించాల్సిన అవసరం ఉందన్నారు.హామీల అమలులో జాప్యం, ఆయా వర్గాలకు రావాల్సిన బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు,అవినీతి, పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వినయ్ భాస్కర్ కోరారు.సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ మర్రి యాదవరెడ్డి,మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, లీగల్ సెల్ బాధ్యులు, మహిళా విభాగం డివిజన్ అధ్యక్షులు, విద్యార్థి విభాగంనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**-- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్**



**వనపర్తి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ మాట్లాడుతూ సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిధులు విడుదల కాకపోవడంతో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇది కేవలం ఫీజుల సమస్య కాదని, 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. బకాయిలు ఆలస్యం కావడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాలలు నిలిపివేయకుండా ప్రభుత్వం వెంటనే ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు డా' సతీష్ యాదవ్, జిల్లా నాయకులు మధు, బి.ఎల్లయ్య, సూర్య ప్రకాష్ గంధం రవి, బి.ఆంజనేయులు, శివ కుమార్, ఈ.రవి, శాంతన్న, రమేష్, స్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




## ఎండపల్లిలో ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజావాణి'

**--ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు: అధికారులకు ఎంపీడీవో హెచ్చరిక**

**ఎండపల్లి:ఆగస్టు 31(తెలంగాణ వాణి)**
ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎంపీడీవో డి. కృపాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు మొత్తం 12 అర్జీలను అధికారులకు సమర్పించారు.

- రెవెన్యూ (తహశీల్దార్) శాఖ: 6
- మండల ప్రజా పరిషత్: 3
- వ్యవసాయ శాఖ: 2
- విద్యుత్ శాఖ: 1

ఈ సందర్భంగా ఎంపీడీవో కృపాకర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, ఎలాంటి అర్జీలను పెండింగ్‌లో ఉంచకూడదని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎ. అనిల్ కుమార్, పీసీ రత్నసాగర్ (పోలీస్ శాఖ), మండల వ్యవసాయ అధికారి కే. మహేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మనోజ్ కుమార్, ఎంఈఓ అసిస్టెంట్ కిషోర్ కుమార్, వైద్య శాఖ ప్రతినిధి రమ్యవల్లి, సీడీపీఓ ఎం. ఆండాలు, ఎస్సీ సంక్షేమ అధికారి చ. మధుకర్, హౌసింగ్ ఏఈ ఎస్. గౌతమి, ఇరిగేషన్ ఏఈ వి. సప్న, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఇ. నరేష్, టీజీఎన్‌పీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. ప్రభాకర్ సహా మొత్తం 13 శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేల ఆర్థిక సాయం



**చౌటుప్పల్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీర్తిశేషులు బట్టపోతు రాములు ఆరో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని దామెర సర్పంచ్ సాతిరి శ్రీధర్ అన్నారు. చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలో వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి 200 వాటర్ క్యాన్లను కుటుంబ సభ్యులు అందజేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, వృద్ధులకు చేతికర్రలు అందించడం వంటి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పునూతల నరసింహ. కుటుంబ సభ్యులు బట్ట పోతు కరుణ, విజయ్, విక్రం, వరుణ్, బట్ట పోతు బిక్షం, సరిపల్లి మంజుల, పెరుమాళ్ళ అరవిందు, ఐతగోని నరసింహ సాతిరి మధు, ఊడగు యాదయ్య, సాతిరి ధనరాజు, బట్ట పోతు సత్తయ్య, ఊడగు రాఘవేంద్ర, ఏన్నం శ్రీనివాస. బియ్య సత్యనారాయణ, సాతిరి రాజు సాతిరి సురేష్ పాల్గొన్నారు.

## రూ.1.05 కోట్ల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**పాలకుర్తి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పాలకుర్తి నియోజకవర్గంలోని అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 262 మంది లబ్ధిదారులకు రూ.1,05,54,100 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి బాధితుడికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పాక్స్ పాలకవర్గాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి : మల్లేపల్లి బుచ్చిరెడ్డి



**తెల్లాపూర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్ ) పాలకవర్గాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని తెల్లాపూర్ పాక్స్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి కోరారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పాక్స్ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఏడాది దాటినా, ఇప్పటికే రెండుసార్లు పదవీకాలాన్ని పొడిగించారని తెలిపారు. నామినేషన్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రిని కోరారు. రైతుల సమ్మతి లేకుండా నామినేషన్ ద్వారా పాలకవర్గాలను నియమించడం సరికాదని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాక్స్ లకు ఎన్నికలు నిర్వహించి రైతులకు ప్రాతినిధ్యం కల్పించాలని బుచ్చిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, అనంతరామ్ కులకర్ణి, పాక్స్ సభ్యులు పాల్గొన్నారు.

## పేద, పీడిత ప్రజలకు అండగా పనిచేస్తా

**అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్**

**వనపర్తి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డా. సతీష్ యాదవ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. అఫ్జల్ చేతుల మీదుగా ఆయన అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్నారు. మొదట రెండు నెలల పాటు రంగారెడ్డి జిల్లా బాధ్యతలు నిర్వహించిన అనంతరం రాష్ట్రస్థాయి పూర్తి బాధ్యతలు అప్పగించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంస్థ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేద, పీడిత ప్రజలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. అఖిలపక్ష ఐక్యవేదికను రాష్ట్రస్థాయిలో బలోపేతం చేసేందుకు త్వరలో అన్ని జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తామని, హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్‌ను కూడా విస్తరిస్తామని సతీష్ యాదవ్ తెలిపారు.

## సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి.



**పెద్దపల్లి , ఆగస్టు 31(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
సిఐటియు తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను అక్టోబర్ 10, 11 తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి తెలిపారు.ఆదివారం శ్రామిక భవన్‌లో సిఐటియు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామిఅధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేశారు.సమావేశాలకు రాష్ట్ర, జాతీయ నాయకులతో పాటు వివిధ జిల్లాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశాల విజయవంతానికి అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు సహకరించాలని కోరారు.జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపై సమావేశాల్లో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌ను తరలించాలి: సీపీఎం




**కరీంనగర్, ఆగస్టు 31(తెలంగాణవాణి)**
నగరంలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కమిషనర్ ఆయాజ్‌కు వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ నుంచి దుర్వాసన, పొగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున డంపింగ్ యార్డ్‌ను తరలించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు.నగరంలో అధ్వానంగా మారిన రోడ్లు, డ్రైనేజీలను వెంటనే బాగు చేయాలని కోరారు.మున్సిపల్ నల్లాల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, నిత్యం తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు వట్టి జగదీష్, నాయకులు రోహిత్, పాతూరి లింగారెడ్డి, గుర్రం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌కు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన



**కరీంనగర్, ఆగస్ట్ 31 (తెలంగాణవాణి)**
ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్ డీసీసీ కార్యాలయం ఎదుట కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ర్యాలీ వేదిక వద్ద బీజేపీ-ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చేసిన కులతత్వ 'శుద్ధీకరణ ఆచారం'ను రాహుల్ గాంధీ ఖండించి ప్రశ్నించినందుకే ఆయనపై హల్ద్వానీ సిటీ కోత్వాలి పోలీస్ స్టేషన్‌లో కక్షపూరితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. కుల ఆధారిత వివక్షను ప్రశ్నించిన రాహుల్ గాంధీపై కేసు పెట్టడం బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. వెంటనే ఎఫ్ఐఆర్‌ను ఎత్తివేసి, అసలు దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు



**నర్సంపేట, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి చెంది నెల రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సహచర ఉద్యమకారులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఊపిరిగా చేసుకుని, ప్రజలే కుటుంబంగా భావిస్తూ పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. నర్సంపేట ప్రాంత అభివృద్ధి, తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన పోరాటం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దార్ల రమాదేవి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బైరి తిరుపతిరెడ్డి, అప్పల సుదర్శన్, రావుల సతీష్ , మచ్చిక నర్సయ్య, రామసాయం ఉపేందర్ రెడ్డి, గుంటి కిషన్, దొంగల సురేష్, మోటూరి రవి, తోట సుదర్శన్, దోనాల రవి, షేక్ ఇర్ఫాన్, మేడిద శ్రీనివాస్, మేడిద రవి, మట్లపల్లి శ్రీనివాస్, వల్లపు శ్రీనివాస్, పేరుమల్ల ప్రభాకర్ రెడ్డి, దాసరి రమేష్, బుస అశోక్, పెరుమండ్ల రవి,పల్నాటి సాంబయ్య, గండ్లోజు భాస్కర్, నల్ల రవీందర్ , వేల్పుల సురేష్, కోరే సుధాకర్, గాదె ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో గైని గంగారాం పాత్ర కీలకం

**ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆయన కృషి ఎనలేనిది: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**



**నిజామాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారాం పాత్ర కీలకమని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. 40 ఏళ్ల పాటు నీటిపారుదల శాఖలో సేవలందించి సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేస్తున్న గైని గంగారాం సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిజామాబాద్‌లో టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘ నాయకుడిగా గంగారాం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని నిజామాబాద్ జిల్లాలో ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం గంగారాం దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం గైని గంగారాం దంపతులను శాలువా, గజమాలతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎంప్లాయిస్ చేసి రాష్ట్ర చైర్మన్ టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ టిఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ హుసేని టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి కోలా శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు టీఎన్జీవో కోశాధికారి నిరంజన్ గౌడ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్ జాఫర్ హుస్సేన్ శ్రీనివాస్ మాణిక్యం జాకీర్ హుస్సేన్ జ్ఞానేశ్వర్ రెడ్డి సృజన్ కుమార్ ప్రవీణ్ రాజ్ సూర్యప్రకాష్ కార్తీక్ మారుతి గీతారెడ్డి మంగారెడ్డి వేణి రాజేశ్వర్ గురు చరణ్ టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ మరియు అన్ని శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు

## సీపీఎస్ రద్దుకు నేడు నిరసన




**మంచిర్యాల, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి కోరారు. సోమవారం మంచిర్యాల టీఎన్జీవో భవన్‌లో సెక్రటరీ జనరల్ వనజారెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పెండింగ్ వేతన సవరణ, ఆరోగ్య పథకం, కరువు భత్యాలు, రూ.12 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని శ్రీహరి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న మధ్యాహ్నం ఒంటి గంటకు నస్పూర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం, బెల్లంపల్లి ఉప కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు దేశ్‌పాండే, బట్టారి వెంకటేశ్వర్లు, సుమిత్, పుప్పాల హనుమంతరావు, శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, దుర్గా ప్రసాద్, భూముల రామ్మోహన్, పత్తి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులు వచ్చిన వారు అధైర్యపడొద్దు

**అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షిస్తాం: బోస్లే నారాయణరావు పటేల్**



**నిర్మల్--తానూర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎస్ఐఆర్ నోటీసులు వచ్చిన ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ అన్నారు. సోమవారం తానూర్ మండలంలో పర్యటించిన ఆయన బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ), బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్లకు అందుతున్న నోటీసులపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నారాయణరావు పటేల్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నోటీసులు వచ్చిన వారు అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పున్లిక్ దేవిదాస్, శ్యామ్ రావు పటేల్, చంద్రకాంత్, మధు పటేల్, శంకర్ చంద్రే తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారంపై దృష్టి: కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విద్యారంగానికి తొలి ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను డీసీపీ ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తదితరులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 7 శాతం పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పేర్కొన్నారు.ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 691 పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలల్లోని వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. కిచెన్ నిర్మాణానికి సింగరేణి సంస్థ సీఎంఆర్ నిధులతో సహకరించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు బుద్ధ ప్రకాష్, రాధాకృష్ణ, హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు సత్య చంద్ర దాస్, కాంతయ్యదాస్, కార్పొరేటర్లు చిలువేరు జ్యోతి, శేరు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ అధికారుల సంఘానికి నవీన్ కుమార్ ఎన్నిక



**మంచిర్యాల,ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు సోమవారం కమిషనరేట్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో పారదర్శకంగా నిర్వహించారు. ఎన్నికల నోడల్ అధికారి అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్ర గౌడ్, రమేష్, ఏఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 70 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన వడ్లకొండ నవీన్ కుమార్ తన ప్రత్యర్థి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌పై 5 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఎన్. శ్రీనివాస్, ఎం. తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా జె. అంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా కె. ఓంకార్, సంస్థాగత కార్యదర్శిగా డి. వినోద్ బాబు, కోశాధికారిగా టి. సుందర్ సింగ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎండి రిజ్వాన్ షా ఖాన్, డి. అనిల్ కుమార్, సిహెచ్. దేవరాజ్, ఎం. రాజిత, ఏ. కపిల్, డి. రాజం ఎన్నికయ్యారు.ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. విజేతలకు సీపీ ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై సంఘం ప్రతినిధులు తక్షణమే స్పందించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి సంఘం బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేయాలని సీపీ ఆకాంక్షించారు.





## ఎంపీడీవో రవి సుధాకర్‌కు ఘన వీడ్కోలు

**వీణవంక, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీణవంక మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రవి సుధాకర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరై రవి సుధాకర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా రవి సుధాకర్ అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబంతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్



**పెద్దపల్లి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్గాం మండలం టిటిఎస్ సంధిపేటకు చెందిన భారతి--సంతోష్ దంపతుల కుమార్తె వివాహానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, టిటిఎస్ అంతర్గాం గ్రామ సర్పంచ్ అంబోతు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీకాంత్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. నూతన దంపతులకు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని వారు ఆకాంక్షించారు.

## గిరిజన విద్యావంతుడు పరమేష్ నాయక్‌కు న్యాయం చేయాలి

**థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి**





**వనపర్తి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కోడేరు పోలీస్‌స్టేషన్‌లో గిరిజన విద్యావంతుడు పరమేష్ నాయక్‌పై అమానుషంగా దాడి చేసి, థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై సంబంధిత ఎస్ఐపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్ డిమాండ్ చేశారు. పరమేష్ నాయక్‌కు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నాయకులు కోడేరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా బంజారా సేవాదళ్ నాయకుడు వస్త్రం నాయక్, జిల్లా అధ్యక్షుడు మురళి నాయక్, ఆంగోత్ శివ నాయక్ మాట్లాడుతూ బాధితుడిపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరమేష్ నాయక్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, చర్యలు తీసుకోకపోతే పోలీస్‌స్టేషన్ ఎదుట నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## గేమింగ్ ఆడుతున్న నలుగురి అరెస్ట్

**రూ.7,900 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని లింగారెడ్డిపేటలో గేమింగ్ ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,900 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



**నిజామాబాద్, ఆగస్టు 31 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ






**రామకృష్ణాపూర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఏసీపీ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని ఎస్ఐ శ్రీధర్‌కు సూచించారు. రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి ఫిర్యాదుల నమోదు, రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ సిబ్బందితో మాట్లాడి కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయడం, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడంపై సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ తనిఖీలో మందమర్రి సీఐ పి. రమేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ గణపతి వార్షికోత్సవం



**రామకృష్ణాపూర్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి ఆవరణలోని శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి 9వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఓ ఎం. మధుకుమార్, సీనియర్ పీవో ఎండీ మదర్ సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల రాజయ్యతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సీఎంఓ కిరణ్ రాజ్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ సహకారంతో నిర్వహించిన వేడుకల్లో అధికారులు, వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన సహపంక్తి భోజనంలో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి:

**జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్.**



**నిర్మల్, ఆగస్టు 31(తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులతో కలిసి అల్పాహారం చేసిన కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వయోవృద్ధులు ఒంటరితనానికి దూరంగా ఆహ్లాదకర వాతావరణంలో సమయం గడిపేందుకు 'ప్రణామ్' డే కేర్ సెంటర్లు ఉపయోగపడుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 'ప్రణామ్' వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ అక్కడి వసతులను పరిశీలించి, వృద్ధులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా వృద్ధులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి అల్పాహారం చేస్తూ ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులకు మానసిక ప్రశాంతత, సామాజిక భద్రత కల్పించడమే కేంద్రాల లక్ష్యమన్నారు. ఆరోగ్య పర్యవేక్షణ, వినోద కార్యక్రమాలు, ఆత్మీయ వాతావరణాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ ముఖ్య కార్యాలయంలో 23 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

**ఆదిలాబాద్, ఆగస్టు : 31( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 23 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ నేరుగా స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను ఓర్పుగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తక్షణమే స్వీకరించి పరిష్కరించే దిశగా కృషి చేయాలని, బాధితులకు న్యాయం చేయడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదులను అందజేసిన వారిలో కుటుంబ కలహాలు, కేసుల వివరాలు, ఫోర్జరీ సమస్యలు, భార్య భర్తల సమస్యలు తదితరా అంశాలతో జిల్లా ఎస్పీకి తమ సమస్యలను తెలియజేశారు. జిల్లా



వ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల విక్రయాలు, చట్టవ్యతిరేక చర్యలపై సమాచారం ఉన్న వెంటనే 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అరుంధతి ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తి చేయాలి

**దళిత సంఘాల జేఏసీ డిమాండ్**

**శంకరపట్నం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
శంకరపట్నం మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న అరుంధతి కళ్యాణ మండపం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అరుంధతి కళ్యాణ మండపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ రూ.50 లక్షల నిధులతో కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టారని తెలిపారు. ప్రభుత్వం మారిన అనంతరం పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్ పనులకు అదనపు నిధులు మంజూరు చేసి భోజనశాల, తాగునీటి వసతి, ప్రహరీ గోడ తదితర సౌకర్యాలు కల్పించి వెంటనే పూర్తి చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరారు. కళ్యాణ మండపం పూర్తయితే పేద,



మధ్యతరగతి కుటుంబాలకు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు మోరే శ్రీనివాస్, ఆరెపల్లి ఓదెలు, పులికోట రమేష్, బోడ సుధాకర్, బొజ్జ రవి, అంతడుపుల సతీష్, ఆడెపు రజిత, కొంద్ర రాజయ్య, దాసారపు భద్రయ్య, క్యాదాసి భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన సమాచారాన్ని వార్తా కథనం శైలిలో, ఆరోపణలను ఆరోపణలుగానే స్పష్టంగా పేర్కొంటూ సవరించాను

- పీఏ వసూళ్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి
- ఎమ్మెల్యే వెంకట్రావు పాత్రపైనా విచారణ చేయాలి
- బంజారా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
ఉద్యోగాలు, బదిలీలు, ఇసుక ర్యాంపుల పేరుతో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పీఏ కొర్ల కళ్యాణ్ కుమార్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వసూళ్ల వెనుక ఉన్న వ్యక్తులను వెలికితీయాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పీఏగా పనిచేసిన కళ్యాణ్ కుమార్ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ల వ్యవహారంపైనా సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. ఎమ్మెల్యే కార్యాలయానికి అత్యంత సమీపంగా పనిచేసే వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యేకు అసలు విషయం తెలియదని చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోందని వీరు నాయక్ అన్నారు. పీఏతో పాటు ఎమ్మెల్యే, సంబంధిత వ్యక్తుల ఆర్థిక లావాదేవీలను కూడా దర్యాప్తు సంస్థలు పరిశీలించాలని కోరారు. జెన్కో, ట్రాన్స్‌కో, ఐటీసీ తదితర సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసాలకు పాల్పడినట్లు వస్తున్న



ఆరోపణలపై నిజానిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల బదిలీల పేరుతో జరిగినట్లు ఆరోపిస్తున్న వసూళ్లపైనా విచారణ చేపట్టాలని కోరారు. గోదావరి ఇసుక ర్యాంపులకు సంబంధించి గతంలోనూ ఎమ్మెల్యేపై వసూళ్ల ఆరోపణలు వచ్చినట్లు వీరు నాయక్ పేర్కొన్నారు. ఈ ఆరోపణలన్నింటిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పీఏ కళ్యాణ్ కుమార్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో కేసులోని అన్ని కోణాలను దర్యాప్తు చేయాలని, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆధారాల మేరకు అసలు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వీరు నాయక్ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో జేఏసీ జిల్లా నాయకులు బానోత్ రమేష్, గుగులోత్ భద్రు, జాటోత్ భరత్, ధరావత్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేయాలి

- ఖర్గేను అవమానించిన వారిని అరెస్టు చేయాలి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఆందోళన

**కొత్తగూడెం, ఆగస్టు 31 (తెలంగాణ వాణి):**
ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఎత్తివేయాలని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కులం పేరుతో అవమానించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెంలో ఆందోళన నిర్వహించారు. ఏఐసీసీ పిలుపులో భాగంగా త్రీటౌన్ సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ..



ఉత్తరప్రదేశ్, ఉత్తరా ఖండ్‌లో ఖర్గేను కులం పేరుతో, శుద్ధీకరణ పేరుతో అవమానించిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేయడం దారుణమని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ అరాచకాలను ప్రజలు సహించబోరని అన్నారు. రాహుల్ గాంధీపై నమోదైన కేసులను ఎత్తివేయడంతో పాటు ఖర్గేను అవమానించిన వారిపై చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఆందోళనలో భాగంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు త్రీటౌన్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, పీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కోడుమూరు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు మంద హనుమంతు, జానీ పాషా, ప్రధాన కార్యదర్శులు పైడా రాజేంద్రప్రసాద్, అబ్బులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సంచార తెగల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**నిర్మల్, ఆగస్టు 31 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సంచార, విముక్త తెగల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సంచార జాతుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార, విముక్త తెగల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంచార జాతుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల వేడుకలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**తాంసి, ఆగస్టు : 31 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
తాంసి మండలంలోని వడ్డాడి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల వేడుకల్లో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మరియు మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నూతనంగా గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు వారు అభినందనలు తెలిపి, ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని పేర్కొన్నారు. అటు పలు నూతనంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ చైర్మన్ ఊహ్కాడే ఉత్తమ్ ,మావల ఎంపీడీఓ ముత్యం రావు,హౌసింగ్ ఏఈ వాసవి ,మావల సర్పంచ్ ధర్మపురి చంద్ర శేఖర్,మావల ఉపసర్పంచ్ స్వప్న అడెలు,సెక్రెటరీ విజయ లక్ష్మీ ,గ్రామ సర్పంచ్ బెండు జయసుధ గంగాధర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ, మండల కన్వీనర్ కౌడల సంతోష్, కాంగ్రెస్ వాడ్డాది నాయకులు పోతాకంటి నవనీత్ రెడ్డి, గడ్డం నవీన్, కేమా హనుమండ్లు, దేవరీ గంగాధర్ , స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వరాహం మృతదేహాన్ని తొలగించిన ఉపసర్పంచ్

**శంకరపట్నం, ఆగస్ట్ 31 (తెలంగాణవాణి)**



మండల కేంద్రం కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డు నివాస గృహాల వెనుక వరాహం మృతి చెంది దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఇబ్బందులకు గురవుతున్న కాలనీవాసులు ఒకటో వార్డు మెంబర్, ఉప సర్పంచ్ ఆకుబత్తిని విజయకుమార్ కు సమాచారం అందించడంతో వెంటనే స్పందించి జెసిబి సహాయంతో వరాహం మృతదేహాన్ని తొలగించి, ట్రాక్టర్ లో తరలించి పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. దీంతో ప్రజాసేవలో అంకితభావంతో సేవలందిస్తున్న ఉపసర్పంచ్ ఉప సర్పంచ్ సేవలపై వర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఆకుపత్రి విజయ్ కుమార్ మాట్లాడుతూ తన వార్డులో గాని, గ్రామంలో గాని పంచాయతీ పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడ్డ వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

## ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరణ.



**పెద్దపల్లి , ఆగస్టు 31**
**(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించిన కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 13 మంది మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబడలేదు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com